సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
సోమవారం । 26 । మే । 2025



చెరువు మట్టితో టీడీపీ నేత వ్యాపారం

ఖాజీపేట మండలం దుంపలగట్టు చెరువు నుంచి తెలుగుదేశం పార్టీ నేత అక్రమంగా మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. -8లో



అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారికి అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
37.1/30.0

వాతావరణం

జిల్లాలో ఆదివారం 30.0 - 37.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

మత్స్యశాఖ డీడీగా రాఘవరెడ్డి

కడప అగ్రికల్చర్: వైఎస్సార్ జిల్లా మత్స్యశాఖ ఎఫ్ఏసీ డిప్యూటీ డైరెక్టర్‌గా నంద్యాల జిల్లా జేడీగా పని చేస్తున్న రాఘవరెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం కడప ఏడీగా పని చేస్తున్న రెడ్డెయ్య ఎఫ్ఏసీ డీడీ విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన స్థానంలో రాఘవరెడ్డిని నియమించారు. ఈయన ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

28న జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

పోరుమామిళ్ల: పట్టణ శివారులోని మల్లకతువ వద్ద ఉన్న వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో ఈ నెల 28న జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు, రాష్ట్ర స్థాయి సెలక్షన్స్ జరుగుతాయని జిల్లా తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ నాయబ్‌రసూల్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం జరిగే ఈ పోటీల్లో పాల్గొనే వారు ఆధార్‌కార్డు, పాస్ పోర్టు సైజ్ ఫొటోలు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. పోటీలు న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. విజయం సాధించిన వారు అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనుటకు అర్హులని వివరించారు.

మహిమాన్వితుడు బత్తులయ్య స్వామి

రాజంపేట: మహిమాన్వితుడు బత్తులయ్య స్వామి అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం బత్తులయ్య సమాధి వద్ద ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బత్తులయ్య 300 ఏళ్ల క్రితం జీవ సమాధి అయ్యారన్నారు. ఆకేపాడు తదితర ప్రాంతాల్లో అనేకమంది ..బత్తులయ్య స్వామిపై భక్తి భావాలను చూపారన్నారు. ఆయన జీవసమాధి ఒక చరిత్రాత్మకమన్నారు. ఆయన వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

కాల్ సెంటర్ 1100 సేవలు వినియోగించుకోండి

కడప సెవెన్‌రోడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు.

సభాభవన్‌లో పీజీఆర్ఎస్ నిర్వహణ

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను (మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్) వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునన్నారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతోపాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో విజ్ఞప్తి చేశారు.

'ఏపీ ఈఏపీసెట్'కు గంటన్నర ముందే చేరుకోవాలి

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలో ఈ నెల 27న ఏపీ ఈఏపీసెట్-2025 పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 7.30 గంటలలోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి 29 వరకు జిల్లా కేంద్రం సమీపంలోని పబ్బాపురంలో 'మహానాడు' కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కందుల ఓబుల్ రెడ్డి మెమోరియల్ (కేఓఆర్ఎం) కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - సైన్సెస్, కేఎస్ఆర్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, కేఎల్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ కళాశాలల్లో ఏపీ ఈఏపీసెట్-2025 పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. 'మహానాడు' నిర్వహించే వేదికకు సమీపంలో ఈ పరీక్షా కేంద్రాలు ఉన్నందున విద్యార్థులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. అయినప్పటికీ ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా పటిష్ట ఏర్పాట్లు చేసిందన్నారు. అయితే పరీక్ష రాసే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకవేళ ఏదైనా ట్రాఫిక్ సమస్యలు ఎదురైతే.. జిల్లా పోలీసు యంత్రాంగం వారు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ హెల్ప్‌లైన్ నంబర్లు : 9121100531(కమాండ్ కంట్రోల్), 9121100515 (ఎస్డీపీవో కడప)కు కాల్ చేసి వారి సాయం పొందవచ్చునని వివరించారు.

కాపు కాసినా.. కరుణ కరువు



- కాపు నేతల్ని విస్మరిస్తున్న తెలుగుదేశం పార్టీ
- ఎమ్మెల్సీ సీఆర్సీ, మాజీ ఎమ్మెల్సీ బత్యాల, సుగవాసి బ్రదర్స్‌కు అప్రాధాన్యత
- మినీ మహానాడు కార్యక్రమానికి దూరంగా ఆ ముగ్గురు
- ఎన్నికల్లో ముందు పెట్టుకొని, ఆపై పక్కన పెట్టిన స్థానిక నేతలు
- రాష్ట్ర మహానాడుకు దూరంగా ఉండిపోవాలని నిర్ణయం!



సి.రామచంద్రయ్య



బత్యాల చెంగల్‌రాయుడు



సుగవాసి బాలసుబ్రమణ్యం

సాక్షి ప్రతినిధి, కడప: 'యథా రాజా తథా ప్రజా' అన్నట్లుగా అధినేత చంద్రబాబు స్ఫూర్తితో.. స్థానిక టీడీపీ నేతలు యూజ్ అండ్ త్రో పాలసీ అందిపుచ్చుకున్నారు. ఎన్నికల్లో వాడుకుని ఆపై ఏమీ పట్టనట్లు వదిలేశారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో కాపు(బలిజ) సామాజిక వర్గ నేతల్ని క్రమేపీ దూరం చేశారు. 'ఆలోచనలు, వ్యూహం, ఎత్తుగడలు మీవే, ఆచరణలో మాత్రమే మేముంటామ'ని చెప్పుకొచ్చి ఎన్నికల్లో వాడుకున్నారు. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన తర్వాత విస్మరించారు. అలాంటి బాధితుల్లో ఎమ్మెల్సీ రామచంద్రయ్య, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయుడు, సుగవాసి బాలసుబ్రమణ్యం, ప్రసాద్‌బాబు ప్రధానంగా నిలుస్తున్నారని విశ్లేకులు భావిస్తున్నారు.

భవిష్యత్తులో అడ్డుగా నిలుస్తారనే..

తెలుగుదేశం పార్టీలో అంతర్గత విభేదాలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. భవిష్యత్తులో అడ్డుగా నిలుస్తారనే అభద్రతా భావంతో.. ఎన్నికల్లో వాడుకున్న అనేక మందిని తర్వాత వదిలేశారు. మేధస్సు, సామాజిక బలంతో ఎమ్మెల్సీ రామచంద్రయ్యకు ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ కండువా కప్పారు. సీనియన్ నేత అయినందు వల్ల.. ఎన్నికల్లో ఆయన బలాన్ని బాగా వాడుకున్నారు. తర్వాత విస్మరిస్తూ వచ్చారు. జిల్లాలో అధికారిక కార్యక్రమాల్లో ఎందులోనూ ఆయనకు ప్రాధాన్యత లభించలేదు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి పూర్తిగా విస్మరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఉనికి కోసం అన్నట్లుగా రామచంద్రయ్య చర్యలు ఉండిపోయాయి. ఇంటి వద్దనే ప్రజాదర్బార్ లాంటి కార్యక్రమాలు చేపడుతూ.. తాను కూడా ఉన్నానని హెచ్చరికలు పంపే చర్యలకు పాల్పడినట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

» బత్యాల.. ఎక్కడ?

రైల్వేకోడూరులో అన్నీ తానై నడిపించిన మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయుడు ఇటీవల కాలంలో రాజకీయంగా కనుమరుగయ్యారు. రైల్వేకోడూరు, రాజంపేట సెగ్మెంట్లల్లో కాపు సామాజిక వర్గాన్ని అనువుగా మల్చుకునేందుకు ఎన్నికల ముందు ఆయనకు ప్రాధాన్యత లభించింది. తర్వాత రాజకీయంగా దెబ్బకొట్టే చర్యలకు టీడీపీ పాల్పడుతోంది. గతంలో విశ్వనాథ నాయుడుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి దెబ్బ కొట్టగా, తాజాగా ఎలాంటి ప్రాధాన్యత లభించడం లేదు. కనీసం రైల్వేకోడూరులోనూ పరిగణనలోకి తీసుకోకుండానే ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయన వర్గీయులు వాపోతున్నారు.

సుగవాసి కుటుంబానిదీ అదే పరిస్థితి..

రాయచోటి పాలకొండ రాయుడు పేరు తెలియని రాజకీయ నేత.. రాష్ట్రంలోనే ఉండరంటే అతిశయోక్తి కాదు. మునుపటి కాలంలో రాయచోటి ఎన్నికలంటే ప్రత్యక్ష యుద్ధం తెరపైకి వచ్చేది. 1978, 83, 99, 2004లలో ఆయన రాయచోటి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1984-89 కాలంలో రాజంపేట ఎంపీగా గెలుపొందారు. మండిపల్లి, సుగవాసి కుటుంబాల మధ్య ప్రత్యక్ష యుద్ధం నడిచేది. అలాంటిది మొన్నటి ఎన్నికల్లో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అభ్యర్థిగా ఎంపిక చేసినా.. సుగవాసి పాలకొండరాయుడు కుటుంబం తెలుగుదేశం పార్టీ ఉన్నతికి పని చేసింది. ఎన్నికల తర్వాత సుగవాసి బాలసుబ్రమణ్యం, ప్రసాద్‌బాబులను ఆ పార్టీ దూరంగా పెట్టింది. రాజంపేట అభ్యర్థిగా ఎన్నికల్లో నిలిచిన సుగవాసి బాలసుబ్రమణ్యానికి కనీసం ఇన్‌చార్జి పదవి కూడా అప్పగించలేదు. మరోవైపు పాలకొండరాయుడు మృతి చెందితే.. సీఎం చంద్రబాబు స్వయంగా పరామర్శించిన దాఖలాలు కూడా లేవు. ఇవన్నీ పరిశీలిస్తే కాపులను జిల్లాలో వ్యూహాత్మకంగా దూరంగా పెడుతున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

» మహానాడుకు డుమ్మా కొట్టే యోచన

ఇప్పటికే ఎమ్మెల్సీ రామచంద్రయ్య, బత్యాల చెంగల్‌రాయుడు, సుగవాసి బాలసుబ్రమణ్యం మినీ మహానాడు కార్యక్రమానికి హాజరు కాలేదు. అందుబాటులో ఉండి కూడా.. టీడీపీ నుంచి ఆశించిన స్థాయిలో చొరవ లేకపోవడంతో హాజరు కాలేదని తెలుస్తోంది. ఈక్రమంలో రాష్ట్రస్థాయిలో కడప గడపలో నిర్వహిస్తున్న మహానాడుకు కూడా హాజరు కాకుండా దూరంగా ఉండిపోవాలని ఆయా నేతల అనుచరులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఆ మేరకు ఆ ముగ్గురు మహానాడు డుమ్మా కొట్టే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

టీడీపీలో ఫ్లెక్సీల రగడ

- ఎమ్మెల్యే మాధవీరెడ్డి ఫ్లెక్సీలు ధ్వంసం
- ముందస్తుగా అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు
- మరొకరికి అవకాశం లేకుండా ప్రధాన ప్రాంతాల్లో ఆక్రమణ
- కార్పొరేషన్‌కు పైసా చెల్లించకుండానే..



కడపలో కోతకు గురైన ఫ్లెక్సీ

సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీలో వర్గ విభేదాలు తీవ్రస్థాయికి చేరాయి. ఇప్పటికే కడపలో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకున్నారు. కొందర్ని సాగనంపాలనే యోచనలో వ్యూహాత్మకంగా ఓ వర్గం అడుగులు వేయగా, అదే స్థాయిలో ప్రతిఘటిస్తూ వైరిపక్షం ప్రశ్నలను సంధించింది. బాధ్యులు స్పందించకపోగా, కేడర్‌ను ఉసిగొల్పారు. ఇలాంటి పరిస్థితిలో తాజాగా ఫ్లెక్సీల రగడ తెరపైకి వచ్చింది. ఎమ్మెల్యే మాధవీరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఊటుకూరు బ్రిడ్జి నుంచి రింగు రోడ్డు వెంట పెట్టిన ఫ్లెక్సీలను ఏకంగా కోసేశారు. ఇలాంటి పరిస్థితి మునుపెన్నడూ లేదని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

ముందుగా ఎవరు ఆక్రమిస్తే..

మహానాడు సందర్భంగా కడప నగరం పసుపుమయమైంది. నగరంలో భారీ స్థాయిలో పసుపు జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలు వెలిశాయి. కార్పొరేషన్‌కు పైసా చెల్లించకుండానే వీటిని ఏర్పాటు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముందుగా ఎవరు జాగా ఆక్రమిస్తే.. వారిదే ఫ్లెక్సీ అన్నట్లుగా నేతలు ఉండిపోయారు. ఈక్రమంలో ఎయిర్‌పోర్టు నుంచి రింగురోడ్డు వెంట కూడా భారీ స్థాయిలో ఫ్లెక్సీలు వెలిశాయి. అందులో ప్రధానంగా ఎమ్మెల్యే మాధవీరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి ఫ్లెక్సీలే ఉండిపోయాయి. ఇతర నియోజక వర్గాల నేతలకు ఆస్కారం లేకుండా ఏర్పాటు చేశారు. కమలాపురం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో కూడా.. ఆ దంపతుల ఫ్లెక్సీలే వెలిశాయి. కాగా ఆదివారం ఉదయానికి ఎమ్మెల్యే మాధవీరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఫ్లెక్సీలు ఏకంగా కోతకు గురయ్యాయి.

▸▸ వర్గ విభేదాలేనా... ఫ్లెక్సీల ఆధిపత్యమా?

నగర తెలుగుదేశంలో పూర్తి స్థాయిలో వర్గ విభేదాలు ఉన్నాయి. అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి కుటుంబాన్ని టీడీపీ నుంచి దూరం చేసేందుకు చర్యలన్నీ పూర్తి అయ్యాయి. అదే స్థాయిలో కార్పొరేటర్ ఉమాదేవితో సహా.. ఎమ్మెల్యే మాధవీరెడ్డి, శ్రీనివాసులరెడ్డి చర్యలపై తీవ్రస్థాయిలో వారు కూడా ధ్వజమెత్తారు. ఈ క్రమంలో ఫ్లెక్సీల ధ్వంసరచన వారిపైకి నెట్టేందుకు ఎవరైనా చేశారా? అనే అనుమానాలు లేకపోలేదు. మరోవైపు కడపతోపాటు కమలాపురం పరిధిలో కూడా ఎమ్మెల్యే మాధవీరెడ్డి ఫ్లెక్సీల ఆధిపత్యం ప్రదర్శించారు. అక్కడి తెలుగుతమ్ముళ్లకు ఆగ్రహం వచ్చి.. ప్రత్యక్ష చర్యలకు పాల్పడ్డారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో తెలుగుదేశం పార్టీలో సఖ్యత లేదనడానికి ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడి ఫ్లెక్సీల ధ్వంసం నిదర్శనంగా నిలుస్తుండటం గమనార్హం.

విజయవంతానికి చర్యలు తీసుకోవాలి

నేతలకు మంత్రుల దిశానిర్దేశం



సమావేశంలో పాల్గొన్న మంత్రులు, నేతలు

కడప రూరల్: మహానాడు విజయవంతానికి అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు తెలిపారు. కడప నగర శివారులోని మహానాడు ప్రాంగణంలో జరుగుతున్న సన్నాహక కార్యక్రమాలను వారు పరిశీలించారు. అనంతరం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో అచ్చెన్నాయుడు, నారాయణ, గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ నేతలు, కార్యకర్తలు, శ్రేణులు కలిసికట్టుగా పని చేయాలన్నారు. భద్రత, వసతి, వేదికలు, రవాణాతో పాటు ఇతర అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పరిశీలకులు పత్తిపాటి కుసుమకుమారి, నిమ్మల రామానాయుడు, ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా నేతలు పాల్గొన్నారు.

మహానాడు తెచ్చిన తిప్పలు

- ఏపీ ఈఏపీ సెట్ విద్యార్థులకు కష్టాలు
- ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే అవకాశం
- పరీక్ష కేంద్రాలకు ముందే చేరుకుంటే మేలు

కడప సెవెన్‌రోడ్స్: టీడీపీ మహానాడు వల్ల మంగళవారం ఏపీ ఈఏపీ సెట్-2025 పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తిప్పలు తప్పేటట్లు లేవు. నగర శివారులోని పబ్బాపురంలో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలి రానున్నారు. ఇప్పటికే కడప నగరంలోని హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లు కిటకిటలాడుతున్నాయి. మహానాడు తొలిరోజే ఏపీ ఈఏపీ సెట్ పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నారు. నగరంలోని కందుల ఓబుల్‌రెడ్డి మెమోరియల్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, కేఎస్ఆర్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, కేఎల్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్, అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ పరీక్షా కేంద్రాలకు కేటాయించిన విద్యార్థులు పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంది. ఎందుకంటే ఈ పరీక్షా కేంద్రాలన్నీ మహానాడు నిర్వహించే ప్రాంతానికి సమీపంలో ఉండటమే కారణం. సాధారణంగా ఉండే ట్రాఫిక్‌తోపాటు మహానాడు కార్యక్రమానికి వచ్చే వాహనాలతో పలు చోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. ఇందువల్ల సకాలంలో విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవడం కష్టతరంగా మారే అవకాశాలు ఉన్నాయి. అందుకే విద్యార్థులు ఈ పరీక్షా కేంద్రాలకు ఉదయం 7.30 గంటల్లోపే చేరుకోవాలని ఏపీ ఈఏపీ సెట్-2025 చైర్మన్, జేఎన్‌టీయూ కాకినాడ ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ ఆర్‌కే ప్రసాద్ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఒక ప్రకటనలో సూచించారు. ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొనకుండా, ఒత్తిడికి గురి కాకుండా ఉండేందుకు ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి సిద్ధం కావాలని కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు తెలిపారు. పరీక్షలు జరుగుతున్నందు వల్ల పోలీసులు కూడా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టి విద్యార్థులకు సహకరించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

ఆర్ఎస్‌కేల కోత.. రైతుకు వెత

- రేషనలైజేషన్ పేరుతో కుదింపు
- రైతు సేవా కేంద్రాల తగ్గింపు
- కొన్ని ఊర్లలో మూతపడుతున్న వైనం
- సిబ్బంది సర్దుబాటు
- ఇక రిక్రూట్‌మెంట్ లేనట్లే




చింతకొమ్మదిన్నెలోని రైతు భరోసా కేంద్రం

కడప అగ్రికల్చర్: దేశానికే రోల్ మోడల్‌గా గుర్తింపు పొందిన రైతు భరోసా కేంద్రాలు నేడు కనుమరుగవుతున్నాయి. ఉన్న ఊరిలోనే రైతులకు అన్ని రకాల సేవలను అందించాలనే లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీటిని ఏర్పాటు చేశారు. వీటి ద్వారా పంట సాగుకు అవసరమైన అన్ని రకాల సేవలు అందేవి. దిగుబడికి గిట్టుబాటు ధర కూడా కల్పించి అండగా నిలిచేవి. దీంతో రైతులు నిశ్చింతగా వ్యవసాయం చేసుకునే వారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చారు. వీటి నుంచి ఎలాంటి సేవలు అందించకపోవడంతో నిస్సహాయ కేంద్రాలుగా మారాయి. రేషనలైజేషన్ పేరుతో వందలాది రైతు సేవా కేంద్రాలను కుదించేస్తోంది. ఉన్న సిబ్బందిని కూడా సర్దుబాటు చేస్తున్నారు. ఇక మీదట ఖాళీ పోస్టుల భర్తీ కాక పోగా.. ఉన్న పోస్టులను సర్దుబాటు చేయడంతో కర్షకులకు కష్టాలు రెట్టింపు కానున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ..

ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో 629 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ఇందులో వైఎస్సార్ జిల్లాలో 423, అన్నమయ్య జిల్లాలో 206 ఉన్నాయి. వీటిలో 629 మంది విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లతోపాటు విలేజ్ సెరికల్చర్ సిబ్బంది ఉండే వారు. ఇందులో కొందరు పదోన్నతులపై వెళ్లగా, మరి కొంత మంది ఉద్యోగాలను వదిలి వెళ్లిపోయారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక ఖాళీ పోస్టులను భర్తీ చేయలేదు. ప్రస్తుతం 305 మంది విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, 177 మంది హార్టికల్చర్ అసిస్టెంట్లు, ఒకరు విలేజ్ సెరికల్చర్ అసిసెంట్ ఉన్నారు. మిగిలిన 146 పోస్టులు భర్తీ చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. ఈ పోస్టులన్నీ రద్దయినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు.



1257 ఎకరాలకు ఒక వీఏఏ, వీహెచ్ఏ..

వైఎస్సార్ జిల్లాలో 1257 ఎకరాలకు ఒక వీఏఏ, వీహెచ్ఏ, అన్నమయ్య జిల్లాలో 750 ఎకరాలకు ఒక వీఏఏ, వీహెచ్ఓ ఉండే విధంగా రేషనలైజేషన్ జరుగుతోంది. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా ఈ ప్రక్రియ చేపడుతున్నారు. దీనిపై వ్యవసాయ, ఉద్యాన శాఖలు కసరత్తు దాదాపు పూర్తి చేశాయి. మిగిలిన భూములకు వ్యవసాయ శాఖలో పని చేస్తున్న ఎంపీఈవోలను కేటాయిస్తారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావుతో మాట్లాడగా.. ఆర్ఎస్‌కేలలో రేషనలైజేషన్ పూర్తయిందని, ఉమ్మడి జిల్లాలో 482 ఆర్‌బీకేలను గుర్తించామని తెలిపారు. అయితే రైతుల సేవలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, ఆర్ఎస్‌కేలలో పోస్టులు తగ్గినా ఎంపీఈవోలతో ద్వారా అందిస్తామని పేర్కొన్నారు.

» ఆర్‌బీకేల ద్వారా గతంలో అందించే సేవలు



గతంలో రైతు భరోసా కేంద్రం ద్వారా పంపిణీ చేస్తున్న ఎరువులు

ఆర్‌బీకేల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్, సెరికల్చర్ అసిస్టెంట్, విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లు ఉంటారు.

- రైతులకు సబ్సిడీ విత్తనాల పంపిణీ
- సర్టిఫైడ్ హామీతో కూడిన ఇన్‌పుట్‌ల సరఫరా
- ఈ క్రాపు బుకింగ్‌కు రైతు డేటాబేస్ అప్‌లోడ్ చేయడం
- పంట సాగుదారుల హక్కు ధ్రువీకరణ పత్రం జారీ, విత్తన సేకరణ కార్యకలాపాలు
- పీఎం కిసాన్, వైఎస్సార్ ఆర్‌బీ, వైఎస్సార్ సున్నా వంటి పంట రుణాల కోసం డేటా అప్‌లోడ్ చేయడం
- విత్తనాలు, ఎరువులు, పురుగు నివారణ మందులు, పశువుల దాణా మొదలైనవి ముందుగా పరీక్షించి సరఫరా
- వివిధ పథకాల కింద లబ్ధిదారుల సామాజిక తనిఖీ, అంటే ప్రకృతి వైపరీత్యాలు, సబ్సిడీ విత్తనాలు మొదలైనవి.
- డిజిటల్ లైబ్రరీ ద్వారా తెగుళ్లు, వ్యాధులపై అవగాహన కల్పించడం
- పొలంబడి, సీడ్ విలేజ్ ప్రోగ్రాం, మినికిట్ ట్రయల్ ప్లాట్లు మొదలైన ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌ల నిర్వహణ
- విత్తన పరీక్ష (భౌతిక స్వచ్ఛత, ఆకురోత్పత్తి పరీక్ష)
- రైతుల సామర్థ్యం పెంపు, ఉత్తమ నిర్వహణ పద్ధతుల వ్యాప్తి, పొలంబడి, పద్ధతి ప్రదర్శనలు మొదలైనవి.
- స్మార్ట్ టీవీ(డిజిటల్ సిగ్నేజ్) క్రాపు నిపుణులచే సాంకేతిక సెషన్‌ల చిరునామాను ప్రత్యక్ష ప్రసారం చేయడం
- స్ప్రేయర్స్ వంటి చిన్న వ్యవసాయ పరికరాలు అద్దెకు తీసుకోవడం
- బీజామృతం మొదలైన సహజ, ఉత్పత్తులపై ప్రదర్శనలు నిర్వహించడం
- అన్ని ప్రభుత్వ పథకాలకు సేవా కేంద్రం
- రైతుల డేటాబేస్, నేల ప్రొఫైల్‌ను నిర్వహించడం
- జంతు ఆరోగ్యకార్డుల జారీ
- ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ, జంతువుల ప్రథమ చికిత్స
- ఇ- క్రాపు బుకింగ్ ద్వారా పశుగ్రాసం అవసరాన్ని లెక్కించడం వంటి కార్యక్రమాలను నిర్వహించడం
- ఇక మీదట ఈ సేవలు ఆర్ఎస్ఎస్‌కేలు లేని ఊర్లలో స్థానికంగా అందవు. దీంతో రైతులకు కష్టాలు మళ్లీ ప్రారంభం కానున్నాయి.

▸▸ మూతపడినట్లే..

వైఎస్సార్ జిల్లాలో 81, అన్నమయ్య జిల్లాలో 66 కేంద్రాలు రేషనలైజేషన్ పేరుతో మూతపడనున్నాయి. వీటికి కొన్ని భవనాలు ఉండగా, మరి కొన్ని భవనాలు లేకపోవడం, మరి కొన్ని చోట్ల భవనాలు అసంపూర్తిగా ఉన్నట్లు తెలిసింది. ఇలా మొత్తంగా 147 రైతు భరోసా కేంద్రాలు మూతపడనున్నాయి. దీంతో ఆ గ్రామాల్లో రైతులకు ఇక మీదట స్థానికంగా సేవలు అందవు.

ఎలాంటి సేవలు అందడం లేదు



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎలాంటి సేవలు అందడం లేదు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఉన్నా.. లేనట్లుగానే అనిపిస్తుంది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. పథకాలను మాత్రం యథాతథంగా కొనసాగించాలి. అప్పుడే రైతలకు మేలు జరుగుతుంది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా వారికి అనుకూలంగా పథకాలను మార్చడం, సేవలను నిర్వీర్యం చేయడం సబబు కాదు. రాజకీయాలకు అతీతంగా ఆర్‌బీకే సేవలను నిర్వహించాల్సిన అవసరం ఉంది.

– సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర ఉద్యాన మాజీ సలహాదారు

ప్రభుత్వం చొరవ తీసుకోవాలి



రైతు భరోసా కేంద్రాల సేవల విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. క్షేత్రస్థాయిలో రైతుల సాగుకు అవసరమైన అన్ని రకాల సేవలందించే.. రైతు భరోసా కేంద్రాల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదు. దీంతోపాటు రేషనలైజేషన్‌ను కూడా ఆపాలి. అన్ని గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల సేవాలను యథావిధిగా కొనసాగించాలి.

– దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

భార్యపై గొడ్డలితో భర్త దాడి

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో సుందర నారాయణ తన భార్యపై గొడ్డలితో దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. తన భార్యతో గతంలో సుందరనారాయణ అనేకమార్లు గొడవపడ్డాడు. ఆదివారం మధ్యాహ్నం మళ్లీ గొడవ పడిన సుందర నారాయణ ఆవేశానికి లోనై గొడ్డలితో భార్య తలపై దాడి చేశాడు. తీవ్ర గాయాలవడంతో ఆమెను మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం

కొండాపురం : తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు తాళ్ల ప్రొద్దుటూరు ఏఎస్‌ఐ కె.విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. కొండాపురం మండలం తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన శివదాస్ కుమార్తె నవనీత దత్తాపురంలోని బంధువుల ఇంటికి శనివారం వెళ్లింది. అదే రోజు రాత్రి నుంచి కనిపించలేదని తండ్రి తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదుచేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరంలోని మృత్యుంజయగుంటలో నివాసమంటున్న దాంట్ల శివయ్య కుమార్తె దాంట్ల గాయత్రి(17)ఈ నెల 17న ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, బంధువుల ఊళ్లలో వెతికి విచారించారు. ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ గుర్తించిన వారు ఎవరైనా పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని పోలీసులు తెలిపారు.

లారీలో డీజిల్ చోరీ

ముద్దనూరు : మండలంలోని గంగాదేవిపల్లె గ్రామం వద్ద లారీలోని డీజిల్ ట్యాంకు నుంచి సుమారు 300 లీటర్ల డీజిల్‌ను చోరీ చేశారు. గంగాదేవి పల్లెకుచెందిన లారీ డ్రైవరు సిమెంట్ లోడుతో ఉన్న లారీని శనివారం రాత్రి తమ గ్రామం వద్ద నిలిపి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం చూసేసరికి ట్యాంకరులోని డీజిల్‌ను దొంగలించినట్లు బాధితుడు తెలిపారు. దాని విలువ సుమారు రూ.30వేలు ఉంటుందన్నారు.

ఏఐతో చర్మ వ్యాధుల గుర్తింపు

కురబలకోట : చర్మ వ్యాధుల గుర్తింపులో ఏఐ (ఆర్టి ఫిషియల్ ఇంటిలిజెన్స్) ఆధారిత పోర్టబుల్ స్కిన్ డిసీజ్ డిటెక్షన్ సిస్టమ్‌ను అభివృద్ధి చేసినట్లు ప్రిన్సిపల్ యువరాజ్ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగ ఆఖరి సంవత్సర విద్యార్థులు ఎం.సాయికృష్ణ, పి.తన్వీరుద్దీన్ ఈ ఘనత సాధించారన్నారు. డెర్మోస్కోపీ చిత్రాల ద్వారా చర్మ వ్యాధులను గుర్తించడానికి డీప్ లెర్నింగ్ మోడల్స్‌ను ఉపయోగిస్తుందన్నారు. రోగులు, ఆరోగ్య సంరక్షణ కార్మికులు సకాలంలో చర్యలు తీసుకోడానికి ఉపయోగపడుతుందన్నారు. తద్వారా సకాలంలో వైద్య పరీక్షలు అందజేయవచ్చన్నారు. విభాగాధిపతి రాజశేఖరన్, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ నాగ్వేత, అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.మణివన్నన్ సహకారంతో ఇది తయారు చేశారని తెలిపారు. అనంతరం విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి అభినందించారు.

పురుగుల మందు తాగి యువకుడు మృతి

పీలేరురూరల్ : పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం పీలేరు పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. పీలేరు పట్టణం లక్ష్మీపురానికి చెందిన కె.రమేష్ కుమారుడు వినయ్‌కుమార్(30)కు ఆరు నెలలు కిందట చంద్రగిరి మండలం అరశపల్లెకు చెందిన నాగరాజ కుమార్తె శశికళతో వివాహమైంది. కొన్ని రోజుల కిందట వీరి దాంపత్య జీవితంలో సమస్యలు మొదలయ్యాయి. శశికళ పుట్టింటికి వెళ్లిపోగా.. పెద్దలు నచ్చజెప్పినా తిరిగి కాలేదు. దీంతో మనస్తాపం చెందిన వినయ్ కుమార్ ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు.

చెరువు మట్టితో టీడీపీ నేత వ్యాపారం

- దుంపలగట్టు చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలింపు
- ఫిర్యాదు అందినా పట్టించుకోని రెవెన్యూ, కేసీ కెనాల్ అధికారులు
- ఈ దారి నుంచే మహానాడు ప్రాంగణానికి టీడీపీ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు



దుంపలగట్టు చెరువులో జేసీబీతో తవ్వి ట్రాక్టర్లకు నింపుతున్న అక్రమార్కులు

ఖాజీపేట : ఎదుటి వారికి చెప్పేందుకే నీతులుంటాయి అన్న మాటలు వారికి వర్తించవేమో.. ఓ వైపు మైదుకూరు, దువ్వూరు చెరువులు, కొండల నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు మట్టి తరలిస్తుంటే రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్.. ఖాజీపేట మండలం దుంపలగట్టు చెరువు నుంచి కొన్ని రోజులుగా వందల ట్రాక్టర్లతో టీడీపీ నేత మట్టిని తరలిస్తూ లక్షలు సంపాదిస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని రైతులు, టీడీపీ వర్గీయులు నివ్వెరపోతున్నారు. కర్నూలు-కడప జాతీయ రహదారి సమీపంలో ఖాజీపేట మండలంలోని దుంపలగట్టు చెరువులో ఇటీవల కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన ఓ టీడీపీ నేత రాత్రింబవళ్లు జేసీబీలు పెట్టి ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తూ ఒక్కో గ్రామానికి ఒక్కో రేటు చొప్పున విక్రయిస్తున్నారు. దుంపలగట్టు చెరువు నుంచి రాములపల్లె చెరువులోకి దారి ఏర్పాటు చేసి అక్కడి నుంచి హైవే రోడ్డు మీదుగా చెన్నూరు, ఖాజీపేట మండలాల్లో అన్ని గ్రామాలకు మట్టిని తరలిస్తూ అమ్ముకుంటున్నారు.

అనుమతులు లేవు.. నిబంధనలు వ్యతిరేకిస్తూ..

దుంపలగట్టు చెరువులో కేసీ కెనాల్ తూముల కంటే తక్కువ లోతుకు చెరువు చేరుకుంది. ఈ క్రమంలో చెరువు మట్టి మరింత లోతుగా తీస్తే పంట పొలాలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈనేపథ్యంలో దుంపలగట్టు చెరువులో మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదని అధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ టీడీపీ వర్గీయుడు దర్జాగా చెరువు చెరబట్టి త్రవ్వకాలు జరుపుతూ మట్టిని అమ్ముకోవడం శోచనీయం. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలో కడప నగర సమీపంలో మహానాడు నిర్వహించేందుకు ఓ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఎమ్మెల్యేలు, మంత్రులు కడప-కర్నూలు జాతీయ రహదారి వెంటే వెళ్తున్నారు. ఈ దారి పక్కనే దుంపలగట్టు చెరువు నుంచి టీడీపీ వర్గీయులు వందల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి అక్రమంగా మట్టి తరలిస్తున్నా పట్టించుకోకపోడం విస్మయం కలిగిస్తోంది. అక్రమ మట్టి త్రవ్వకంపై ఆర్డీఓ, తహసీల్దారు, కేసీ కెనాల్ అధికారులు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిప్రతినిధులు, అధికారులు స్పందించి దుంపలగట్టు చెరువులోని మట్టి అక్రమ రవాణపై చర్యలు తీసుకుని చెరువును కాపాడాలని కోరుకుంటున్నారు.

అశ్రునయనాల నడుమ ప్రమాద మృతులకు అంత్యక్రియలు



మృతదేహాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఆదిత్యరెడ్డి, రెడ్యంవెంకటసుబ్బారెడ్డి



బిడ్డల మృతదేహాలను చూసి కన్నీటి పర్యంతం అవుతున్న తల్లి శశికళ

నివాళులర్పించిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్/బి.కోడూరు : గువ్వల చెరువు ఘాట్‌రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చింతపుత్తాయపల్లె గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి, శిరీషల అంత్యక్రియలు ఆదివారం అశ్రునయనాల నడుమ ముగిశాయి. బంధువులు, స్నేహితులు కడసారి చూసేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఇదిలా ఉంటే బి.కోడూరు మండలంలోని గంగిరెడ్డిపల్లె సాయిహర్షిణి, రుషికేశవరెడ్డిల మృతదేహాలకు భారీ జనసందోహంతో కన్నీటి వీడ్కోలు పలికారు. పిల్లలను కడసారి చూసేందుకు తల్లిదండ్రులైన జర్మనీ నుండి వచ్చిన తిరుపతిరెడ్డి, కడసారి చూపు కోసం ఆసుపత్రి నుండి అంబులెన్స్‌లో తీసుకువచ్చిన శశికళలను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి, ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల సమన్వయ కర్త కె.రమణారెడ్డి, బద్వేలు మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నాయకులు బోడపాడు రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వీరనారాయణరెడ్డి, బి.కోడూరు మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలు మృతదేహాలకు నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేయడంతో పాటు వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వీరి వెంట చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీనరసారెడ్డి, జయరామిరెడ్డి, పోలిరెడ్డి, యోగానందరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మదనపల్లె సిటీ : రోడ్డుప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మదనపల్లె మండలం బార్లపల్లె వద్ద ఆదివారం తెల్లవారు జామున జరిగింది . బెంగుళూరు రూరల్ మండలం చోళప్పనహళ్లికి చెందిన వెంకటేశప్ప కుమారుడు నరేష్(25) మదనపల్లెకు సొంత పనుల మీద ద్విచక్ర వాహనంలో వచ్చాడు. రాత్రి పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా బార్లపల్లె వద్ద ఐచర్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో నరేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి జేబులోని ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. రూరల్ సీఐ కళావెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి దుర్మరణం

కలకడ : అడవి పందులను చంపడానికి అమర్చిన విద్యుత్ తీగలు తగిలి ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు.. సంబేపల్లి మండలం సోమవరం సమీపంలో బ్రహ్మంగారి మఠం గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన ఏకరి మురళి(24), నారాయణనెల్లూరు జిల్లా పామూరు మండలం గురకాయపేటకు చెందిన నారాయణ(38) కంప చెట్లు కాల్చి బొగ్గులు చేసుకుని విక్రయించి జీవనం సాగిస్తున్నారు. శనివారం రాత్రి కుందేళ్ల వేట నిమిత్తం కలకడ మండలం ఎగువబట్టావారిపల్లి సమీపంలోని కోమటివాని చెరువు సమీపానికి వెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు అడవి పందులను చంపడానికి అక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తాకారు. షాక్‌తో మురళి అక్కడికక్కడే మృతి చెందగా, నారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

బైక్‌లు ఢీకొని ఒకరు..

రాజంపేట : కడప-రేణిగుంట జాతీయ రహదారిలోని మన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు బైక్‌లు ఢీకొని ఒకరు దుర్మరణం చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఓబుళవారిపల్లె మండలం చిన్నంపల్లెకు చెందిన గూడూరు గణేశ్‌రాజు (16) బైక్‌లో వెళ్తున్నారు. మరో బైక్ వేగంగా వస్తోంది. రాజంపేట బైపాస్ రహదారిలోని పద్మప్రియ కల్యాణ మండపం వద్దకే చేరగానే రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో గూడూరు గణేష్‌రాజు(16) అక్కడికక్కడే మృతి చెందారు. బైకులో ఉన్న మరో ఇద్దరికి తీవ్ర గాయాలవడంతో చికిత్స నిమిత్తం రాజంపేట వైద్యశాలకు తరలించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన కారు

పుల్లంపేట : కడప-చెన్నై జాతీయ రహదారి రామక్కపల్లి వద్ద ఆదివారం మధ్యాహ్నం తిరుపతి నుంచి రాజంపేటకు వైపు వెళ్తున్న ఇన్నోవా కారు రామక్కపల్లి రోడ్డు ప్రక్కన ఉన్న దుకాణంలోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తూ దుకాణంలో ఎవరూ లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పిల్లల సంరక్షణపై దృష్టి పెడదాం



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

కడప అర్బన్ : పిల్లల సంరక్షణ, పిల్లల అపహరణ, దోపిడీ లేని ప్రపంచాన్ని చూసేలా దృష్టి పెడుతూ ఐసీఎంఈసీ సంస్థ సేవలందిస్తోందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి చైర్మన్ ఎల్.వెంకటేశ్వరరావు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి సి.ఆసిఫాసుల్తానా అన్నారు. తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా కడప ప్రభుత్వ బాలుర గృహంలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లైంగిక వేధింపులు, పిల్లల దోపిడీ జరగకుండా చూసేలా 1998లో యునైటెడ్ స్టేట్స్‌లో ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్ (ఐసీఎంఈసీ) సంస్థ ప్రారంభించారన్నారు. ప్రస్తుతం 29 దేశాల్లో పలు సంస్థలు ఈ ఐసీఎంఈసీ పరిధిలో పనిచేస్తున్నాయని తెలిపారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌లు ప్రవీణ్‌కుమార్, రవితేజ మాట్లాడుతూ తప్పిపోయిన పిల్లలను ఇంటికి తీసుకురావడం. చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024, తదితర వాటిపై వివరించారు, విద్య విలువైనదని.. క్రమశిక్షణతో అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ జె.లక్ష్మి, సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాజకీయ అరాచకపాలన

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య



మాట్లాడుతున్న గుజ్జల ఈశ్వరయ్య

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాజకీయ అరాచక పాలన సాగిస్తోందని, దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రధాని నరేంద్రమోదీ తాకట్టు పెట్టారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య అన్నారు. రైల్వే కోడూరులో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ పేరుతో భారతీయులను చంపిన టెర్రరిస్టులను ఎంత మందిని హతమార్చారో ప్రధాని తెలపలేదన్నారు. దేశంలోని అటవీ సంపద కార్పొరేట్ కంపెనీలకు ధారదత్తం చేయడానికి మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్ చేశారన్నారు. 2007లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి శంఖుస్థాపన చేసిన ఉక్కు పరిశ్రమను వెంటనే నిర్మించాలన్నారు. అప్పట్లో సీఎం రమేష్ ఈ ప్లాంట్ కోసం నిరాహారదీక్ష చేసినా, ఇప్పటికీ శంకుస్థాపన రాళ్లు వెక్కిరిస్తున్నాయని పేర్కొన్నారు. జూన్ 2న అన్ని మండల కేంద్రాలలో ఆందోళన చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నరసింహులు, నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, పండుగోల మణి, దార్ల రాజశేఖర్, చైతన్య, గంగాధర్ పాల్గొన్నారు.

మున్సిపాల్టీలో పన్నులు వసూలు చేయండి

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

కడప ఎడ్యుకేషన్ : మున్సిపాలిటీల పరిధిలో పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీసీ హాల్లో మున్సిపల్ అధికారులతో ఆదివారం ఆయన సమీక్షించారు. సమీక్షా సమావేశం ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్ను వసూళ్లకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి వార్డుకు క్లస్టర్ స్థాయి పన్నుల జాబితా రూపొందించాలన్నారు. వాటర్ టాక్స్, అడ్వర్టైజ్మెంట్, ట్రేడ్ లైసెన్స్, షాప్ రెంట్లు, బిల్డింగ్ ఛార్జీల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. బద్వేల్, కమలాపురం అండర్ అసెస్మెంట్‌లపై సర్వే చేయించాలన్నారు. టౌన్ ప్లానింగ్‌లో ఆన్లైన్ విధానాన్ని రెండు నెలల్లో అమలు చేస్తామన్నారు. కడప నగరంలో 387 షార్ట్ ఫాల్స్ సమస్యలపై టౌన్ ప్లానింగ్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే రెండేళ్లలో రూ.125 కోట్లతో నూతన స్లీపింగ్ మిషన్లను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అతిథిసింగ్, పబ్లిక్ అండ్ హెల్త్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆర్డీ విశ్వనాథ్, టౌన్ ప్లానింగ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ సంజీవ్ కుమార్, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ కుమార్, రాకేష్ చంద్ర, అధికారులు పాల్గొన్నారు.

మహానాడుకు భారీ బందోబస్తు

జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్



పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 27, 28, 29వ తేదీలలో జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బందోబస్తు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్, అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, సీఐడీ ఎస్పీ శ్రీధర్, నార్కోటిక్స్ ఎస్పీ పి.నగేష్ పేర్కొన్నారు. సీఎంతో పాటుపలువురు వీఐపీలు, మంత్రులు మహానాడులో పాల్గొనే నేపథ్యంలో సికె దిన్నె పరిధిలోని మహానాడు వేదిక, జయరాజ్ గార్డెన్ హాల్, మాధవీ కన్వెన్షన్ హాల్‌లో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందితో వారు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా బందోబస్తు ప్రణాళికను వివరిస్తూ సెక్టార్ల వారీగా విధులు నిర్వర్తించాలన్నారు. పెద్ద ఎత్తున ప్రజలు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్‌పరంగా అవాంతరాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రూట్ బందోబస్తు, ట్రాఫిక్ డైవర్షన్, క్లియరెన్స్ సెక్టార్ల అధికారులకు ఏమి చేయాలి? ఏమి చేయకూడదు? ఎస్పీ వివరించారు. అనంతరం పబ్బాపురం వేదిక వరకూ కాన్వాయ్ వచ్చే మార్గంలో చేపట్టాల్సిన భద్రతాచర్యలపై కాన్వాయ్ రిహార్సల్స్‌లో ఎస్పీ పాల్గొ పాల్గొని దిశానిర్దేశం చేశారు.

పిచ్చి కుక్క స్వైరవిహారం

ఒకే రోజున ఎనిమిది మందిపై దాడి



పిచ్చికుక్క దాడిలో గాయపడిన శబరినిధి



పవన్‌కుమార్‌రెడ్డి కాలికి గాయం చేసిన పిచ్చికుక్క

బద్వేలు అర్బన్ : పట్టణంలోని వెంగమాంబ నగర్, సుమిత్రానగర్ తదితర ప్రాంతాల్లో ఆదివారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. ఒకే రోజున ఆయా ప్రాంతాల్లోని ఎనిమిది మందిపై దాడి చేసింది. తొలుత ఇంటి ముందు ఆడుకుంటున్న రోషిణి (11), శబరినిధి(5)లపై దాడి చేసి గాయపరచింది. నరసమ్మ(57), హుస్సేన్‌బాషా(50), రోడ్డు వెంట నడుచుకుంటూ వెళుతుండగా వారిపైనా విరుచుకుపడింది. వీరితోపాటు శ్రీకాంత్, మహబూబ్‌నాజర్, పవన్‌కుమార్‌రెడ్డిలపై కూడా దాడి చేయడంతో అందరూ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. సిద్దవటం రోడ్డులో పిచ్చికుక్క మరో ఇద్దరిపై కూడా దాడి చేయగా వారు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నట్లు తెలిసింది. ఇటీవల కాలంలో పట్టణంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని మున్సిపల్ సిబ్బందికి తెలిపినప్పటికీ పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు.

కుక్కల దాడిలో పొడదుప్పికి గాయాలు



గాయపడిన పొడదుప్పి

కలసపాడు : మండలంలోని పాతరామాపురం సగిలేరు వద్ద కుక్కలు దాడి చేసి పొడ దుప్పిని గాయపరిచాయి. స్థానికులు గమనించి దుప్పిని కాపాడి అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఎగువ తంబళ్లపల్లె సెక్షన్ ఆఫీసర్ రమణయ్య ఘటనా స్థలానికి చేరుకుని పొడదుప్పిని కలసపాడు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. అనంతరం అటవీ కార్యాలయానికి తరలించారు.

గుజిరీ దుకాణంలో గంజాయి

ఐదుగురి అరెస్టు, 2.100 గ్రాముల స్వాధీనం



నిందితుల అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ సిబ్బంది

మదనపల్లె రూరల్ : పట్టణంలో గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోంది. చాపకింద నీరులా మత్తు విస్తరిస్తోంది. పట్టణ శివారు, నిర్మానుష్య ప్రాంతాల్లో యువకులు గంజాయి తీసుకుని మత్తులో జోగుతున్నారు. ఈఎస్‌టీఎఫ్ సీఐ వి.యల్లయ్య, ప్రొహిబిషన్, ఎక్సైజ్ బీఎంపీపీ సీఐ సత్యశ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. నక్కలదిన్నె తండా సమీపంలోని పాత సామాన్లు, స్క్రాప్ విక్రయించే గుజిరీ దుకాణంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్, బీఎంపీపీ, రాయచోటి ఈఎస్‌టీఎఫ్ సీఐ, సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించారని తెలిపారు. పొన్నేటిపాళెంకు వెళ్లే దారిలోని గుజిరీ దుకాణంలో గంజాయి విక్రయిస్తుండగా పట్టుకుని 2.100 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు మోషే అలియాస్ బన్ను పారిపోగా, ఎస్.మహమ్మద్‌బాషా (22), సయ్యద్‌సద్దాం (35), బి.దినకర్ (21), పి.సాయిప్రసాద్ (25)లను అరెస్టు చేసి, గంజాయి రవాణాకు వినియోగిస్తున్న హోండా డియో టూవీలర్‌ను సీజ్ చేశామన్నారు.

ఆస్పత్రిలో పారిపోయే ప్రయత్నం

గంజాయి అమ్ముతుండగా పట్టుకున్న నిందితులను రిమాండ్‌కు పంపే ముందు వైద్య పరీక్షల కోసం ఎక్సైజ్ సిబ్బంది జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. నిందితులను పరీక్షిస్తుండగా గంజాయి మత్తులో ఉన్న పల్లపోలు సాయిప్రసాద్ పోలీసుల కళ్లుగప్పి తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. వేగంగా పరిగెత్తగా, అప్రమత్తమైన ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది అతడిని పట్టుకున్నారు. మత్తులో ఉన్న సాయి ప్రసాద్ పిచ్చిపిచ్చిగా మాట్లాడుతూ, మత్తులో తూలడం కనిపించింది.

వర్షాలు కురుస్తున్నాయి.. విష సర్పాలతో జరభద్రం



రాజంపేట టౌన్ : ఈ ఏడాది రుతుపవనాలు ముందస్తుగానే వచ్చేశాయి. వాతావరణం చల్లబడడమేగాక వర్షాలు కురుస్తున్నాయి. ఇదిలా వుంటే ఇన్ని రోజులు ఎండ వేడిమికి కటవల్లో, చెట్ల నీడన దాగిన విష సర్పాలు ప్రస్తుతం వాతావరణం చల్లబడడంతో పొదల్లోకి వచ్చి చేరుతాయి. అలా బయటకు వచ్చిన విష సర్పాలు రైతులను, ప్రజలను కాటేసే ప్రమాదం ఉంటుంది. సాధారణ సర్పాలైతే పెద్దగా ప్రాణాపాయం ఉండదు. అదే విష సర్పాలు కాటేస్తే వెంటనే వైద్యం చేయించుకోవాల్సిందే. లేకుంటే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం లేకపోలేదు. వర్షాకాలంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

విష ప్రభావం ఉన్న పాములివే

కట్లపాము, నాగుపాము, రక్తపింజరి, జెర్రిపోతు వంటి పాముల్లో విష ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కట్లపాము కాటేసిన క్షణాల్లోనే విషం రక్తకణాల్లో కలుస్తుంది. ఏమాత్రం ఆలస్యం లేకుండా వైద్యుడిని సంప్రదించి వైద్యం చేయించు కోకుంటే మనిషి ప్రాణాపాయస్థితికి చేరుకుంటాడు. అలాగే నాగుపాము కాటేసిన పదిహేను నిమిషాల్లోనే శరీరంలోకి విషం ఎక్కుతుంది. ఇక రక్తపింజరి కాటేసిన రెండు గంటల్లో విషం శరీరంలోకి చేరుతుంది. జెర్రిపోతు కాటేసిన పెద్ద ప్రమాదం ఉండదు. అయినా చికిత్స చేయించుకోవాలి.

పాముకాటును బట్టి వైద్యం

పాముకాటును బట్టి కాటేసింది విషపు పామా కాదా నిర్ధారణ అవుతుంది. కాటులో రెండు కోరల మధ్య దూరం, లోతును బట్టి వైద్యులకు తెలుస్తుంది. పాము కరిచిన చోట నీలంగా, వంగ పండు రంగులా మారుతుంది. ఉబ్బులా, లావుగా అవుతుంది. ఈ లక్షణాలను బట్టి వైద్యులు కాటేసింది విషపు పామా కాదా అని నిర్ధారిస్తారు. కొంతమంది పాము కాటువేయగానే ఆ ప్రాంతాన్ని కోస్తే రక్తంతోపాటు విషం బయటకు వస్తుందని కత్తి, బ్లేడు వంటి వాటితో గాటు పెడతారు. అలా ఏమాత్రం చేయకూడదని వైద్యులు సూచిస్తున్నారు. ఒకొక్కమారు పాముకాటుకంటే కోసిన గాయం ప్రమాదకరంగా మారవచ్చు. పాము, తేలు కాటు వేసిన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి.

ఎలాంటి లక్షణాలుంటాయి

- పాము కాటువేసిన ప్రదేశంలో కోరల గాయం స్పష్టంగా కనిపిస్తుంది. నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- విషం క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది. పాక్షికంగా పక్షపాతం రావచ్చు.
- నాలుక మందమైనట్లు, గొంతు కండరాలు బిగుసుకున్నట్లు ఉంటుంది.
- కళ్లు మగతగా, శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రైతులు పంట పొలాల వద్దకు వెళ్లే సమయంలో, పొలాల గట్టుమీద నడుచుకుంటూ వెళ్లేటపుడు కర్రచప్పుడు చేస్తూ నడవడం మంచిది. పొలాలకు వెళ్లే రైతులు టార్చిలైటు వేసుకుంటూ వెళ్లాలి. ధాన్యం బస్తాలు నిల్వ వుండే చోట, గడ్డివాములు ఉండే ప్రాంతంలో ఎలుకలు, కప్పలు తిరుగుతుంటాయి. అందువల్ల పాము తినేందుకు ఆ ప్రాంతాలకు వచ్చే అవకాశం ఉంది. తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆ సమయంలో పాదరక్షలు విధిగా వేసుకువెళ్లాలి.

మంచి మందులు ఉన్నాయి



పాముకాటుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మంచి మందులున్నాయి. ఆ వ్యక్తికి ఏఆర్‌వీ, యాంటి స్నేక్ వీణం మందులతో వైద్యం అందిస్తాం. ఎవరికైనా పాము కరిస్తే నాటు వైద్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలి. కొంతమంది పాముకాటు గురైన వెంటనే నాటుమందు, ఆకుపసురుతో వైద్యం చేసుకొని సరిపెడతారు. ఇలా చేస్తే ప్రాణాలను సైతం కోల్పోయే ప్రమాదం లేకపోలేదు.

– డాక్టర్ పాలనేని వెంకట నాగేశ్వరరాజు, సూపరింటెండెంట్, రాజంపేట